7

# స్వాభిమానం

కింది భాగాన్ని బలంగా లాగేసి, బలవంతంగా పైకి తోసినట్లుగా ఒక్క సారిగా పైకెగిరింది విమానం.

ఎత్తయిన భవనాలు, దీపాలు మెల్ల మెల్లగా మాయమవుతున్నాయి. భూమి మొహంలోంచి న్యూయార్క్ నగరం మాయమైపోయింది.

స్వేచ్ఛగా చీకటిని, శూన్యాన్ని సర్రున నరికేస్తూ, దారిచేసుకుంటూ ప్రొఫెల్లర్ సాయంతో ప్లేన్ ముందుకి దూసుకుపోతోంది. కిటికీలోంచి బయటికి చూసింది శ్యామల. అంతా శూన్యం.

ఇది దేనికి అంతం అవుతుందో! దేనికి మొదలవుతుందో!! నిట్టూరుస్తూ బయటికి చూసింది. చీకటి, అనంతమైన చీకటి. అక్కడేం ఉండదు. ఆకర్షణలు, పాశాలు, బంధాలు, బంధనాలు ఏమీ వుండవు. అంతా ఇక్కడే. అందుకే జరిగింది మర్చిపోలేక పోతోంది. మామూలు సంగతులు మర్చిపోవచ్చు కానీ గుండెని కోసేసినవి ఎలా... మరిచిపోయేంత మతిమరుపు ఇంకా రాలేదు.

వెంటనే పక్క ఫ్లాట్‌లోని అంజమ్మ గుర్తొచ్చింది.

"పిల్లలెన్ని అవమానాలు చేసినా, వాళ్ళమీద కోపం తెచ్చుకోకూడదు. వాళ్ళు నా కన్నా చిన్నవాళ్ళు. వాళ్ళతో ధైర్యంగా పౌరుషంగా ఎలా మాట్లాడుతాను?"

అంజమ్మ అన్నదే నిజమా! కొడుకుని చూస్తే గజ గజా వణికిపోతుంది. మొగుడూ, కొడుకూ ఇద్దరూ ఆమెమీద పెత్తనం చేస్తూంటారు. వాళ్ళేం చేసినా కోపం తెచ్చుకోకూడదని అంటుంది. ఎలా! కోపం తెచ్చుకోకుండా ఎలా ఉండాలి? ఎంత పిల్లలైతే మాత్రం తల్లికి అవమానం అంటే ఏవిటో తెలీకూడదా? ఆమె మంచితనం ఎప్పుడు గుర్తిస్తారు?" ఆ మాటే అంది అంజమ్మతో.

అంజమ్మ నవ్వింది.

"తల్లి మంచితనం పిల్లలు గుర్తించాలన్న రూలేం లేదు. నా విధి నేను చేస్తాను..."

"మరి వాళ్ళ విధి... నీదంతా వెర్రి. పిల్లలు అవమానిస్తే నీ ఆత్మగౌరవానికి, ఆత్మాభిమానానికి విలువేం వుంది?"

"నీకు తెలీదు శ్యామలా! నువ్వు చాలా అదృష్టవంతురాలివి. నువ్వు స్వతంత్రురాలివి. నువ్వు నీ కొడుకు మీద ఆధారపడి లేవు. ఎప్పుడైతే, ఎక్కడైతే ఆధారపడడం ఉంటుందో, అక్కడ స్వతంత్రం ఉండదు. వ్యక్తిత్వం ఉండదు. ఆత్మగౌరవం అంటే ఏవిటో తెలీనట్లుగా ఉండాలి. నేనూ, ఆయనా వాడిమీద ఉన్నాం కాబట్టి, చిన్నా చితకా స్పర్ధలు సర్దుకుపోవాల్సిందే. మొగుడితో సర్దుకున్నట్లే, కొడుకుతో కూడా సర్దుకుపోవాలి."

ప్రతీ తల్లికి, కొడుకుకి ఘర్షణ. అది లోపల ఉంటుంది. దాన్ని అధిగమించే వ్యాపకం ఉంటే పర్వాలేదు. అది లేకపోతేనే ప్రతిక్షణం లోపల సంఘర్షణ.

'అంజమ్మా! నువ్వే రైటు. ఆధారపడ్డ తల్లికి స్వతంత్రం చాలా తక్కువ' అని మనసులోనే అనుకుని కళ్ళు మూసుకుంది శ్యామల.

ఇంటి భారం, పిల్లలిద్దరి భారం అవలీలగా భుజానికి ఎత్తుకుని, బాధ్యతని విలువల శిలువగా మోసిన రోజుల్లో కూడా ధైర్యంగా ఉంది. ఏనాడూ కుంగిపోలేదు.

కొడుకు ఎమ్మెస్ చెయ్యడానికి వెళ్తే, ఇల్లు తాకట్టు పెట్టిందే కానీ భయపళ్ళేదు. 'ఎలాగా' అని అనుకోలేదు.

వేరే కులం అమ్మాయిని పెళ్ళిచేసుకుంటానంటే, మనస్ఫూర్తిగా ఆశీర్వదించింది.

పెళ్ళిలో ఆడపెళ్ళివారు తనకి, కూతురు శ్వేతకి ఏ మాత్రం మర్యాద ఇవ్వకపోయినా పోనీలే, వాళ్ళతో మనకేంటి అని కూతురికి నచ్చచెప్పి తన మనసుని సమాధాన పర్చుకుంది.

కోడలికి ఇద్దరు పిల్లలు పుట్టినప్పుడు, కూతురు శ్వేత పురుళ్ళు. అందుకని అమెరికా వెళ్ళాల్సిన అవసరం శ్యామలకి రాలేదు. కోడలు అస్మిత తల్లే వాళ్ళ దగ్గర ఉంది. ఎవరో పెద్దవాళ్ళు వాళ్ళ దగ్గరున్నారులే అని తృప్తిపడింది.

తనున్న ప్రపంచంలోంచి, సముద్రాల అవతల ఉన్న కొడుకుని అద్దంలో తలకిందులుగా చూస్తూ మురిసిపోయింది.

తమకి సూర్యుడొస్తే, మామయ్య ప్రపంచం చీకటిగా ఉంటుందని కూతురి కొడుకు ఆశ్చర్యపోతూంటే, ఓ టార్చిలైటు బత్తాయి పండుతో ప్రయోగం చేయించి, భూ భ్రమణంలో ఈ చీకటి వెలుగులు ఎంత సహజంగా వస్తాయో వాడికి వివరంగా చెప్పింది.

కానీ, ఈ రోజు పక్కా వ్యాపార ఫక్కీలో జీవితం గడిపేస్తున్న కొడుకు, చీకట్లో తడుముకుంటూ వెళ్తున్న వాడి ప్రవర్తన, జీవన భ్రమణంలో సహజమే అని మనసుని సరిపెట్టుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది.

తల్లీ కొడుకుల బంధాల్లో లాభనష్టాలా? ఈ బంధంలో గుండెకి ఏ మాత్రం సంబంధం లేదా?

శ్యామల జరిగింది గుర్తు తెచ్చుకుంది.

అమెరికా రమ్మనమని రోజూ ఫోన్లు చేస్తూంటే పక్కింటి అంజమ్మకి, పైన ఉండే శేషయ్యకి చెప్పింది. శేషయ్య, శ్యామల స్వంత అన్నయ్య.

"కూతురి పెళ్ళి చేశావు, ఇద్దరి పిల్లలకి పురుళ్ళు పోశావు. ఇంక రిటైరయిపోయి కొడుకు దగ్గరికెళ్ళు. ఎన్నాళ్ళిలా ఒక్కదానివీ ఉంటావు, కొడుకు, కోడలూ, మనవలూ అక్కడే వాళ్ళతోనే ఉండు" ఇద్దరూ అదే అన్నారు. అదే సరిఅయినదనిపించింది.

వెంటనే శేషయ్య దగ్గరుండి అన్ని పనులు పూర్తిచేయించి, విమానం ఎక్కించాడు.

అప్పుడు కూడా, సరిగ్గా ఇలాంటి విమానంలోనే, మూడు నెలల క్రితం, ఎప్పట్నించో రమ్మంటున్న కొడుకు నరసింహం ఉన్న న్యూయార్కుకి వెళ్ళింది.

కోడలు అస్మిత, మూడేళ్ళ మనుమడు ప్రతీక్, ఏడాది మనవరాలు ప్రీతి చేతులు చాచి నవ్వుతూ ఆహ్వానించారు. మురిసిపోయింది.

ఓ పదిహేనురోజులు గడిచేసరికి, శ్యామల ఇంటి బాధ్యతని మెల్లిమెల్లిగా తీసేసుకుంది. అది తన కర్తవ్యంగా భావించింది.

వంట చెయ్యడం, పిల్లలని చూడడం, పార్కుకి తీసికెళ్ళడం, ప్రీతికి పాలు పట్టడం, జ్యూస్ పట్టడం, ప్రతీక్‌కి అన్నం తినిపించడం, బట్టలు మార్చడం- అన్నీ కూడా ఎంతో ఇష్టంగా, మనస్ఫూర్తిగా, ఆనందంగా చేసింది.

వాళ్ళని ఆడించింది, పాడించింది. కథలు చెప్పింది. జోల పాటలు పాడి, వాళ్ళని నిద్రపుచ్చింది. పిల్లలు బాగా దగ్గరయ్యారు. కానీ అస్మిత దగ్గరవలేదు. పోనీలే అనుకుంది.

గంటల తరబడి తల్లితో మాట్లాడుతుంది. నాతో ఓ పది నిమిషాలు కూడా గడపదేం... అని అనుకున్న క్షణాలున్నాయి. అయినా ఆమె తత్వం అంతే అని సరిపెట్టుకుంది. కూతురు కూతురే. కోడలు కోడలే అనుకుంది.

ఓ రాత్రి భోజనాలయిపోయాక, వంటిల్లు సర్దుకుంటోంది శ్యామల.

నర్సింహం తల్లి దగ్గరకొచ్చాడు.

"అస్మితకి మా ఆఫీసులోనే ఉద్యోగం దొరికింది...."

సంభ్రమంగా కొడుకుని చూసింది.

"మంచిది, ఇంతకీ ఎప్పుడు దొరికింది..."

"ఉద్యోగం వచ్చి చాలా రోజులే అయింది... కానీ..."

శ్యామల మనసు చిన్నబోయింది. ఎందుకు చెప్పలేదు. అడిగితే... చెప్పాలని రూలేం లేదు కదా! అని అంటే... మొహం ఎక్కడ పెట్టుకోవాలి.

"అస్మితకి ఉద్యోగం వచ్చింది. మేం ఇద్దరం ఉద్యోగాలకి వెళ్తాం. నువ్వు పిల్లల్ని చూడగలవా?" అంటే ఎంతో సంతోషించేది.

కానీ, శ్యామల తన భావాలని పైకి కనిపించనీయలేదు.

"ఎల్లుండి సోమవారం జాయినవ్వాలి. ఇద్దరం కలిసి వెళ్తాం. కలిసే వస్తాం. ఎప్పుడేం చెయ్యాలి? ఏ ఫోన్ నంబర్లు దేనికో అన్నీ వివరంగా, రేపాదివారంనాడు చెప్తాను."

ఈ మాటలన్నీ కోడలు చెప్తే ఎంత బావుంటుంది? కొడుకే ఎందుకు చెప్పాలి? మా మధ్య ఇంత అగాధం ఎందుకు?

"అలాగేలేరా! పిల్లల్ని, ఇంటినీ నేను జాగ్రత్తగా చూసుకుంటాను" సంతోషంగా మనస్ఫూర్తిగా అంది.

"అందుకే కదా నిన్ను రమ్మన్నది. ప్రీతి పుట్టడం, దగ్గరలోనే మంచి ఉద్యోగం దొరకక అస్మిత ఇంట్లోనే ఉండిపోయింది. ఇప్పుడు నువ్వొచ్చావు, నువ్వున్నావు పిల్లల్ని చూడ్డానికి..."

నువ్వొచ్చావు, నువ్వున్నావులోని అర్థాలు వెతకాలని అనుకోలేదు. ఇప్పుడు ఖాళీగా ఉన్నాను. పిల్లల్ని, ఇంటిని నేను చూస్తే వాళ్ళు ఉద్యోగం చేస్తారు. డివిజన్ ఆఫ్ లేబర్ అని అనుకుంది. ఇది తన ఇల్లు. వీళ్ళు తనవాళ్ళే. పరాయివాళ్ళేం కాదు కదా!

శ్యామల, కొడుకు కోడలు వెళ్ళిపోయాక ప్రతీక్‌ని బస్సెక్కించి, ప్రీతిని తయారు చేసి, వంట చేసి ఇల్లు సర్ది భోజనం అయ్యాక మనవడిని తీసుకొచ్చి వాడికి తినిపించి, కొంచెంసేపు ఇంట్లో ఆడించాక సాయంత్రం ఎదురుగా వున్న పార్కుకి తీసుకెళ్తుంది.

అలా వెళ్ళిన మొదటిరోజుల్లో... రావుగారితో శ్యామలకి పరిచయం ఏర్పడింది.

"మనవలు చిన్నగా ఉన్నప్పుడు వాళ్ళకోసం విజయవాడ నుంచి నేనూ, మా ఆవిడా వచ్చాం. మనవలు పెద్దవాళ్ళయిపోయారు. వాళ్ళకి ఇంకా మా అవసరం లేదు. ఈ లోకంలో తన అవసరం తీరి, నా భార్య పైలోకానికెళ్ళింది. ఒంటరివాడి మిగిలిపోయాను. సాయంత్రం పార్కుకొస్తుంటాను. విజిట్ వీసా మీద వచ్చిన పెద్దవాళ్ళకి,

మరోళ్ళకి, వాళ్ళ వాళ్ళకి తీరుబడి లేకపోతే గైడుగా మారిపోయి, ఆ ఊళ్ళూ ఈ ఊళ్ళూ చూపిస్తుంటాను. ఒకవేళ మీ అబ్బాయికి కానీ, కోడలుకి కానీ వీలుకాకపోతే నన్నడగండి. గైడుగా మీతో వచ్చి అమెరికా అంతా చూపిస్తాను..."

కలుపుగోలుగా మాట్లాడుతున్న అతన్ని చూస్తుంటే, అన్నయ్య శేషయ్య గుర్తొచ్చాడు. ఇవాళో రేపో నర్సింహాన్ని అడిగి అన్నయ్యతో మాట్లాడాలి. రావుతో ఎంతోసేపు మాట్లాడి ఇంటికొస్తే, పరాయింటికొచ్చినట్లుగా అనిపించింది. ఎందుకని మనసు విప్పి మాట్లాడేవారు లేరనే కావచ్చు.

ఇంట్లో అస్మిత ముభావం, నర్సింహంకి తన పని, పిల్లలు వాళ్ళ గదిలో ఏదో ఆడుకోవటం, టీవీ చూడ్డం, శ్యామల ఒక్కత్తే నిశ్శబ్దంగా ఉంటోంది. అలవాటులేనిది అలా నిశ్శబ్దంగా ఉండటం. కానీ, అలవాటు చేసుకుంటోంది.

కానీ, ఈ జీవితానికి అలవాటుపడాలి. తప్పదు. ఇండియా జీవితం వేరు, అమెరికా జీవితం వేరు. కంపేరిజన్ లేదు. అలా చేస్తూ బతకాలని లేదు. జీవితం ఎప్పుడూ నచ్చినట్లుగా ఉండదు. ఎలా ఉన్నా జీవితాన్ని ఆహ్వానించాలి అనుకుంది.

అలవాటులేని పనులు, గిన్నెలు తోముకోవడం, పిల్లల పనులు విశ్రాంతి తక్కువవడంతో, ఒంట్లో సరిగ్గా ఉండడం లేదు. కాళ్ళ నొప్పులు, జ్వరం వచ్చినట్లుగా అనిపిస్తోంది. అయినా అలాగే పనులు చేస్తోంది. కొడుకుకి చెప్పడానికి ఇష్టపడలేదు. తన దగ్గరున్న కిట్‌లోంచి క్రోసిన్ తీసి వేసుకుంటోంది. దేనికి ఏ మందో అన్నీ రాసుకుని వచ్చింది, ఊరి నుంచి ఇక్కడికి వచ్చేప్పుడు.

పార్కుకి తీసుకెళ్ళాలనిపించక, ప్రతీక్‌ని టీవీ ముందు కూచోపెట్టి కార్టూన్లు పెట్టింది. ప్రీతిని తన గదిలో పడుకోపెట్టింది. సోఫాలో కూచుని, కళ్ళు మూసుకుంది. నిద్రపట్టేసింది.

"నానమ్మా, లే... పార్కుకెళ్దాం... లే..." అంటూ శ్యామల చేయి పట్టుకుని లాగాడు ప్రతీక్.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. చెయ్యి లాగుతున్న ప్రతీక్‌ని, దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంది.

"చెల్లి పడుకుంది కదా... లేచాకా వెళ్దాం... చూడు కార్టూన్లు, పోనీ నా ఒళ్ళో కూచొని టీవీ చూస్తావా! రా... మనిద్దరం కలిసి కార్టూన్లు చూద్దాం.. సరేనా!"

వెంటనే ప్రతీక్ కోపంగా రిమోట్‌ని, శ్యామల చేతిలోంచి లాక్కుని, టకటకా ఛానెల్స్ నొక్కి, నొక్కి, మార్చేసి, రిమోట్‌ని కిందపడేసి గట్టిగా ఏడవటం మొదలెట్టాడు.

"ఇప్పుడే... వెళ్దాం... రా... రా..." అని గట్టిగా అరుస్తున్నాడు.

వాడి అరుపులకి, ఏడుపుకి శ్యామల భయపడింది.

"ఇక్కడ పిల్లల్ని ఏం అనకూడదు. తిట్టకూడదు. కొట్టకూడదు. ఏడిపించ కూడదు. ఎవరైనా కంప్లైంట్ ఇచ్చారంటే పోలీసులు పట్టుకుంటారు. ఇది మన దేశం కాదు. పిల్లల్తో చాలా జాగ్రత్తగా ఉండాలి" ఇంచుమించుగా ఇదే అర్థం వచ్చేటట్లు కొడుకు చెప్పాడు. పార్కులో రావు కూడా చెప్పాడు.

తన వెంట తెచ్చిన 'పెద్దబాలశిక్ష'ని తీసుకొచ్చి ప్రతీక్ దగ్గర కూచుని, అందులో ఉన్న పదాలకి యాక్షన్ చేస్తూ అర్థం చెప్తోంది.

వాడు కోపంగా ఆ పుస్తకాన్ని శ్యామల గదిలోకి విసిరేశాడు. ఆ పుస్తకం కాస్తా ప్రీతి ఉన్న మంచానికి గట్టిగా తగిలేసరికి, శబ్దం అయింది. ఆ శబ్దానికి ప్రీతి లేచి ఏడవడం మొదలెట్టింది.

శ్యామల దాన్ని ఎత్తుకుని, ఓ జ్యూస్ సీసాని దాని నోట్లో పెడ్తూ టీవి ఎదురుగా ఉన్న సోఫాలో కూచోబోయింది.

ఏడుస్తున్న ప్రీతి, సీసాని తోసేసింది. అది కాస్తా ఏడుస్తున్న ప్రతీక్‌కి తగిలింది. అసలే నిప్పు తొక్కిన కోతిలా ఉన్నాడేమో, దానితో ఇంకా గొంతు పెంచి ఏడవడం మొదలెట్టాడు.

సరిగ్గా అదే సమయానికి కొడుకు నర్సింహం, అస్మిత తలుపు తీసుకుని లోపలికొచ్చారు.

ఏడుస్తున్న పిల్లలు, వాగుతున్న టీవీ. నుంచున్న శ్యామల.

"ఏవిటీ ఏడుపులు? ఇవాళేనా? లేకపోతే రోజూ ఇంతేనా?" నొసలు చిట్లించి అంటున్న అస్మితని చూసి తెల్లబోయింది. ఏం చెప్పాలో వెంటనే తోచక అలాగే చూస్తుండిపోయింది.

"వాళ్ళిద్దరూ అలా ఏడుస్తూంటే సముదాయించకుండా టీవీ చూస్తున్నారా! ఇవాళ ఏదో పని ఉందని మేం తొందరగా వచ్చాం కాబట్టి మీరు పిల్లల్ని ఎలా చూస్తున్నారో తెలిసింది. లేకపోతే పిల్లలు మీ దగ్గర బావున్నారని అనుకుంటూ ఓ రాంగ్ నోషన్‌లో ఉండే వాళ్ళం"

ఏదో చెప్పడానికి నోరు తెరవబోయింది. కొడుకుని చూసింది. అనువదించలేని భావాలతో ఉన్న ఆ చూపులకి కుంగిపోయింది. తనని ఎలా డిఫెండ్ చేసుకోవాలో ఆమెకి తెలీలేదు.

"బయటికి తీసుకెళ్ళమని ప్రతీక్ గొడవ చేస్తూంటే... టీవీ కార్టూన్లు పెట్టాను. ప్రీతి లేచాకా వెళ్దామన్నాను..." అంది మెల్లగా.

వింతగా చూసింది అస్మిత.

"కార్టూన్లా! అవి కార్టూన్లా! అదే ఛానెల్ కాస్త చూడండి. హిందీ సీరియల్ వస్తోంది. మీరే చూస్తూ, వాడికి కార్టూన్లు పెట్టానని అంటారేం?"

ఆశ్చర్యంగా టీవీ చూసింది. నిజమే, ఏదో హిందీ సీరియల్... ప్రతీక్ ఇందాకా కోపంలో మార్చేసినట్లున్నాడు. నర్సింహాన్ని చూసింది.

"నువ్వేం చెప్పకమ్మా! కనపడ్తున్నదానికి ఎలాంటి సంజాయిషీ ఇస్తావ్?" అంటూ తల్లిని చూశాడు.

భూమిలోకి జారిపోయినట్లుగా అనిపించింది.

"బయట కూడా ఏం పెద్దగా పట్టించుకుంటున్నారని, ఏదో చెప్పబోతున్నారు. ఎప్పుడూ ఎవరితోనో మాట్లాడుతూంటారట... నాకేం తెలీనట్లుగా ఉన్నాను. నాకీ సంగతి ఎప్పుడో తెలుసు..."

రాయిలా ఉండిపోయింది.

"నేను నర్సింహతో చెప్తూనే ఉన్నాను. మీ మమ్మీకి పిల్లల్ని చూడడం రాదని. కానీ, తను విన్లేదు. మా అమ్మ అమెరికా రావాలి... అమెరికా రావాలి... అని పట్టుపట్టాడు. మా మమ్మీ ఎంత బాగా చూస్తుందో. నిజానికి పిల్లలు కూడా సంతోషంగా ఉండేవారు. మా సిస్టర్‌కి బాబు పుట్టాడని అక్కడికి వెళ్ళింది... లేకపోతేనా!..."

చెవుడొస్తే బావుండునని శ్యామలకనిపించింది.

"అస్మితా! స్టాపిట్..." అన్నాడు నర్సింహం గట్టిగా.

ఈ లోపల పిల్లలిద్దరూ ఏడుపు ఆపేశారు.

"ఏం అంత కోపం ఎందుకూ? మా మమ్మీ వచ్చేవరకూ పిల్లలిద్దర్నీ 'డే కేర్ సెంటర్'లో పెడ్దామంటే ఏమన్నావ్? గుర్తుందా! అమ్మ పిల్లల్ని చూస్తే పదిహేను వందల డాలర్లు మిగుల్తాయని అన్లేదా! అన్నావా లేదా! చూడూ... ఇక్కడేం జరుగుతోందో! ఎంత మిగుల్తోందో! ఈవిడకయ్యే ఖర్చుకి, డే కేర్ సెంటర్ ఖర్చుకి ఏం తేడా లేదు. అంతా ఒకటే. పోనీ పిల్లలేమన్నా..." అంటూ శ్యామలకేసి చూసింది.

శ్యామల గుండె నిశ్శబ్దంగా వెయ్యి ముక్కలయింది. ముక్కలన్నీ చర్మాన్ని చీల్చుకుని బయటికొచ్చేస్తాయేమోనని కుడి చేత్తో గుండెని గట్టిగా అదుముకుంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఏం జరగనట్లే కొడుకూ కోడలూ ప్రవర్తించినా శ్యామల మామూలుగా ఉండలేకపోయింది.

ఆ తర్వాత చాలా రోజులకి పిల్లల్ని తీసుకుని పార్కుకు వెళ్ళింది. అక్కడ రావుగారు కనిపించారు.

"చాలా రోజులయింది మీరిక్కడికి వచ్చి. చాలా డల్‌గా ఉన్నారు. ఏం సిస్టర్, ఒంట్లో బాగాలేదా! పోనీ ఓ పని చేయండి... అమెరికా చూడ్డానికొచ్చిన కొంతమంది పేరెంట్స్‌ని తీసుకుని బఫెలో, నయాగరా, వాషింగ్‌టన్ అవి చూపించడానికి వెళ్తున్నాను... ఇలాంటి టూర్స్ వేస్తూంటానని తెలుసు కదా! కొంచెం ఛేంజ్, సరదాగా రండి. ఇక్కడి ఊళ్ళు అవీ చూద్దురుగానీ..." నవ్వుతూ అన్నారు.

ఏం మాట్లాడలేదు.

రెట్టించి మరోసారి అడిగేసరికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నర్సింహం కన్నా ఈ రావుగారు చాలా దగ్గర మనిషిలా అనిపించాడు ఆ క్షణంలో.

ఒక్కసారిగా గంగమ్మ పొంగింది. ప్రవాహానికి ఆనకట్ట వేయదల్చుకోలేదు. ఆ రోజు, తేలికైన మనసుతో వచ్చింది.

అస్మిత పిన్నికూతురు బోస్టన్‌లో ఉంటోంది. సత్యనారాయణ వ్రతం చేసుకుంటోందని అందరూ శుక్రవారం సాయంత్రం అక్కడికి వెళ్ళడానికి తయారవుతున్నారు. నర్సింహం, ప్రతీక్ శ్యామలని రమ్మన్నారు. శుక్రవారం రాత్రికే వెళ్ళిపోయి, ఆదివారం పొద్దున్న వచ్చేయాలని నెలరోజుల ముందు నుంచే వాళ్ళు ప్లాన్ వేసుకున్నారు. శ్యామల రానంది. వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆదివారంనాడు నర్సింహం, అస్మిత, పిల్లలు వచ్చారు. వెంటనే శ్యామల గురించి పట్టించుకోలేదు. ఓ గంట పోయాక ప్రతీక్ గుర్తించాడు. నాయనమ్మ గురించి అడిగాడు.

"లోపల ఎక్కడో ఉంటుందిలే..." అంది అస్మిత.

నర్సింహం ఇల్లంత చూశాడు. శ్యామల కనపళ్ళేదు. వంటింట్లో ఏమీ చేసుకున్నట్లుగా కూడా అనిపించలేదు.

అదే అన్నాడు అస్మితతో.

"ఆ... ఎక్కడికి పోతారులెండి. ఇక్కడే ఎక్కడో ఉంటారు. ఏదో చిన్న నాటకం. మనం ఇవాళ వస్తామని తెలిసీ కూడా ఇంట్లో లేరు. అంటే... ఏవిటర్థం.. జెలసీ..." ఇల్లు దులపడానికి సిద్ధపడుతోంది.

"అమ్మకి జెలసీయా! ఎందుకూ? నేను కొడుకునే, పరాయివాడిని కాదు కదా... నా మీద జెలసీ వుంటుందా?"

"జెలసీ ఉన్నది నీ మీద కాదు నా మీద. పెళ్ళయిన ఎనిమిదేళ్ళకే మీ నాన్నగారు పోయారని అన్నారు. ఆవిడకి సంసార సుఖం అదీ లేదు కదా... అందుకని".

"కాదు" అని గట్టిగా అనలేకపోయాడు.

పైగా "జానేమో" అని అనిపించింది.

టైము గడుస్తున్నకొద్దీ శ్యామల విషయం తెలీలేదు. ఎక్కడికైనా వెళ్ళి దారి తప్పిపోయిందేమోనని కారేసుకొని నాలుగు వీధులు, అన్ని పార్కులూ చూసి ఇంటికొచ్చాడు.

పోనీ ఎవరికైనా ఫోన్ చేస్తే! భయపడ్డాడు. ఎన్ని విషయాలు బయటికివస్తాయో! చిన్న విషయాలే కావచ్చు. కానీ నలుగురి నోళ్ళల్లో నానితే పెద్దగా అవుతాయి.

పోలీసుల సాయం తీసుకుందామంటే, దానంత నరకం ఇంకోటి ఉండదు. అమెరికాలో పోలీసులతో వ్యవహారం అంటే కొరివే.

ఆత్మహత్య కానీ చేసుకోలేదు కదా! ఆ ఆలోచనకే కంపించిపోయాడు. అదే జరిగితే... తన పరువేం కావాలి?

కాళ్ళూ చేతులూ ఆడడం లేదు. మనసు మనసులో లేదు. ఏం చేయాలో తెలియడం లేదు.

అస్మిత పైకి బింకంగానే ఉన్నా, లోపల భయంగానే ఉంది. ఏదో వండింది. ఏదో తిన్నారు. ఆదివారం నాడు చేసుకునే పనులు కూడా చేసుకోలేదు.

సాయంత్రం ఏడు దాటింది. ఫోన్ మోగింది.

పది లంఖణాలు చేసినంత నీరసంగా ఉన్న నర్సింహం ఉలిక్కిపడి లేచి స్ప్రింగ్‌లా ఫోన్ దగ్గరకెళ్ళాడు.

ఫోన్ శబ్దం విన్న అస్మిత గదిలోంచి బయటికొచ్చి, మెట్ల దగ్గర ఆగింది.

ఫోన్ తియ్యబోతూ అస్మిత వైపు భయంగా చూశాడు. వెంటనే తీసి "హలో" అన్నాడు.

"హలో! నర్సింహా! నేనురా... అమ్మని... క్షేమంగా చేరాను..."

ఊపిరి తేలిగ్గా పీల్చుకున్నాడు. ఆశ్చర్యంగా అస్మితని చూస్తూ అమ్మ అన్నట్లుగా సైగ చేశాడు.

"చేరాను... అంటే ఎక్కడున్నావ్? ఎక్కడనుంచి మాట్లాడుతున్నావ్?" మెట్లు దిగుతున్న అస్మితను చూస్తూ ఆదుర్దాగా అడిగాడు.

"హైదరాబాద్ నుంచే. శేషయ్య మామ టాక్సీ తీసుకుని ఏర్‌పోర్ట్‌కి వచ్చాడు..."

ఏదో అడుగుతున్నాడు. శ్యామల సమాధానం ఇయ్యదల్చుకోలేదు. ఇస్తే ఎన్నో అడుగుతాడు. అప్పుడు ఎన్నో చెప్పాల్సి వస్తుంది. దానితోపాటూ, మనసు కూడా బయటపడిపోతుంది.

"ఎలా వచ్చానా! అవన్నీ ఇంటికెళ్ళాకా మాట్లాడుకుందాం. నేను ఏర్‌పోర్ట్‌లోంచి మాట్లాడుతున్నాను. అస్మితని, పిల్లల్ని అడిగానని చెప్పు... గదిలో నా అల్మారాలోని బట్టల కింద ఓ కవరుంచాను. అది తీసుకో..." ఫోన్ పెట్టేస్తూంటే బోసిగా ఉన్న చేతులు కంపించాయి. కృతజ్ఞతతో రావుగారిని తలచుకుంటూ శేషయ్య దగ్గరికొచ్చింది.

ఒక్క అంగలో తల్లి గదిలోని క్లోసెట్ తెరిచి, దుప్పట్ల కింద ఉన్న గులాబీ రంగు కాగితం మడత తీసుకొచ్చి సోఫాలో కూచుని తెరిచాడు కళ్ళు పరిగెత్తాయి.

"నర్సింహానికి, అస్మితకి...

యుద్ధం పక్క దేశంతోనో, పొరుగునున్న శత్రువుతోనో అయితే నిస్సంకోచంగా, నిర్భయంగా చేయవచ్చు. కానీ, ఇంట్లో వాళ్ళతో అయితే... ఎలా చెయ్యడం. ఆ పరిస్థితి రాకుండానే మేలుకున్నాను.

ఈ రోజుల్లో మనలాంటి చిన్న చిన్న కుటుంబాల్లో, భాష ఓ పెద్ద పాత్ర వహిస్తుంది. అది కరువైతే, యుద్ధమే మరి.

నా తరం నుంచి, మనవల తరానికి అందించాల్సినవి ఎన్నో ఉన్నాయి. మన సంస్కృతి, పండుగలు, వంశం, పుట్టుపూర్వోత్తరాలు, ఆచార వ్యవహారాల గురించి, నేనున్న సమాజం గురించి చెప్పాలి. ఈ తరాల మధ్య వంతెనలు వేయాలని, అది నా బాధ్యత అనుకున్నాను.

అందుకే నువ్వు రమ్మనగానే, వాలంటరీగా రిటైరయ్యి ఓ పెద్ద ధర్మకార్యం నిర్వర్తించాలనుకుని వచ్చాను. నేను మీ కుటుంబంలోని దానినని అనుకున్నాను. కానీ మీరు జీతం బత్తెంలేని ఆయాగా అనుకోవడం నా దురదృష్టం.

అస్మిత దృష్టిలో డే కేర్ సెంటర్‌లోని నానీకి, ఇంట్లోని గ్రానీకి తేడా లేకపోవచ్చు. కానీ నాకు, మనవలకి మధ్య ఉన్న బంధంలో డబ్బు లేదు. డబ్బు పారేస్తే కొనే బంధం కాదు. మా బంధంలో ఉన్నది రక్తం. ఇమోషనల్ అది.

డబ్బు సంపాదన, లాభనష్టాల లెక్కలు తప్ప జీవితానికేం లేదనుకుంటే అది అజ్ఞానం.

నేను మీ దగ్గరికి రానూ అని భీష్మించుకోను. నీ పిల్లలతోపాటు నీ తల్లి కూడా నీ ఇంట్లోని, నీ కుటుంబంలోని వ్యక్తి అని మీరు అనుకున్న రోజున తప్పకుండా వస్తాను. నాయనమ్మలా వస్తాను. ఆయాగా కాదు.

నేను మీ ఇంట్లో ఉన్నప్పుడు ఒంటరిగా ఫీలయ్యే దానిని. ఆ ఒంటరితనం నాకు హైదరాబాద్‌లో లేదు. అసలా ఫీలింగ్ ఎప్పుడూ రాలేదు. అలాంటి వాతావరణం రాకపోయినా, కనీసం ఒకరికొకరం అనే వాతావరణం మీ ఇంట్లో నాకు కనిపిస్తే, నా ప్రయత్నం ఫలించినట్లే. అందుకోసమే నేనీ అడుగు వేశాను.

అస్మితని నా కూతురిలా భావించాను, ఆమె కనీసం అత్తగారిలా కూడా నన్ను చూడలేకపోయింది. అయినా నేను క్షమించేశాను. నేను పెద్దదాన్ని, చిన్నవాళ్ళమీద నెగిటివ్ భావాలుండవు. ఇది రాస్తున్నప్పుడు నాకు మా అంజమ్మ గుర్తొచ్చింది. ఒకప్పుడు ఆమె భావాలతో ఏకీభవించలేదు. కానీ, ఆమే రైటు. తల్లులు కొడుకుల్ని ఏమీ అనరు. కోపం తెచ్చుకోరు. అన్నింటినీ చిరునవ్వుతో స్వీకరిస్తారు. నేనూ ఓ అమ్మనే..."

ఇంక చదవలేకపోయాడు. ప్రతీ అక్షరంలో ఆత్మాభిమానం నిండిన అమ్మ మొహం కనిపిస్తోంది. తన వికృత రూపం కాదు కాదు స్వభావం కనిపిస్తోంది.

*ఆంధ్రభూమి వారపత్రిక, 2 అక్టోబర్ 2008*